నేడు ఉద్యోగ సంఘాల సమావేశం

సుభాష్‌నగర్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశాన్ని ఆదివారం సమావేశం నిర్వహిస్తున్నట్లు టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి సంగెం లక్ష్మణరావు ఓ ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ టీఎన్‌జీవో భవన్‌లో నిర్వహించే ఈ సమావేంలో భవిష్యత్ కార్యాచరణ, జేఏసీ ఏర్పాటుపై చర్చిస్తామన్నారు. ఉద్యోగ జేఏసీ సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.



కార్పొరేట్ చాయ్

- అందుబాటులోకి వివిధ రకాల టీలు
- రూపుమారిన టీ కొట్లు
- రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ

తలనొప్పిగా ఉంది.. బయటికెళ్లి ఒక 'టీ' తాగాలి... అల్లం టీ, బెల్లం టీ, గ్రీన్ టీ, లెమన్ టీ, శొంఠి టీ, బ్లాక్ టీ, ఇరానీ టీ. కుండ టీ.. ఇందులో ఏ 'టీ' తాగుదాం.. ఒకప్పుడు టీ అంటే సాంప్రదాయబద్ధంగా చేసేవిమాత్రమే అందుబాటులో ఉండేవి. ఇప్పుడు పరిస్థితి మారింది. రకరకాల టీలు అందుబాటులోకి వచ్చాయి. అందుకు తగ్గట్టు పలు ఫ్రాంచైజీలు టీస్టాల్స్ ఏర్పాటు చేశాయి. ఇంతకు ముందు టీస్టాల్స్‌లో కూర్చునేందుకు స్థలం కూడా ఉండకపోయేది. ఇప్పుడు కార్పొరేట్ లుక్‌లో టీస్టాల్స్ అదరగొడుతున్నాయి.. మారుతున్న పోకడలకు అనుగుణంగా మారిన చాయ్‌లపై 'ఆదివారం ప్రత్యేకం'..

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

7లో

ఆదివారం ప్రత్యేకం

మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి ఇన్‌ఫ్లో

- నేడు గేట్లు ఎత్తనున్న అధికారులు



ఎల్‌ఎండిలో ఉన్న నీటి నిల్వలు

తిమ్మాపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి మిడ్‌మానేరు నుంచి శనివారం మధ్యాహ్నం ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేశారు. మిడ్ మానేరు నుంచి 4300, ఎగువ కాకతీయ కాలువ నుంచి 500, మొత్తం 4800 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీలోకి వస్తోంది. మిషన్ భగీరథ ఆవిరి రూపంలో 277 క్యూసెక్కుల నీరు ఎల్‌ఎండీ నుంచి అవుట్ ఫ్లో వెళుతుంది. ఎల్‌ఎండీ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా ప్రస్తుతం 23.903 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఎల్‌ఎండి పూర్తి స్థాయి నీటి సామర్థ్యానికి చేరుకోవడం, మిడ్ మానేరు నుంచి ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉండడంతో ఆదివారం ఉదయం ఏడు గంటలకు ఎల్‌ఎండీ గేట్లు ఎత్తి నాలుగు వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేయనున్నట్లు ఇరిగేషన్ ఈఈ పి నాగభూషణరావు తెలిపారు. మానేరు పరివాహక ప్రాంతంలోకి పశువులు, గొర్రెలు తీసుకెళ్లొద్దని, చేపలు పట్టేవారు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలి

- ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ పమేలా సత్పతి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): జీవితంలో బాలికలు ధైర్యంగా ముందుకు సాగాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ బాలిక దినోత్సవానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు ఇప్పుడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అయినా భ్రూణహత్యలు జరగడం బాధాకరమన్నారు. సమాజంలో మహిళలపై ఇంకా చిన్నచూపు తగ్గలేదన్నారు. యుక్త వయసు రాగానే బాలికలకు సమాజం పట్ల భయాన్ని నూరిపోసున్నామని అన్నారు. చదవడం ఒక్కటే ఎదగడానికి మార్గమని సూచించారు. ప్రతి బాలిక మరో బాలికకు అవసరమయ్యే సహాయం తప్పకుండా చేయాలన్నారు. మహిళకు సానుభూతి అవసరం లేదని సాహసంతో ముందుకు సాగాలన్నారు. బాలుడికి ఇచ్చే ప్రోత్సాహాన్ని, అవకాశాన్ని బాలికలకు ఇవ్వాలని తల్లిదండ్రులకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఏ సమస్య వచ్చినా బాలికలు తల్లికి చెప్పాలని, తల్లి మాటలు వినాలని సూచించారు. ప్రతి చిన్న అవకాశాన్ని వదులుకోకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ మాట్లాడుతూ బాలికలపై వివక్ష కుటుంబం నుంచి మొదలవుతుందని, ఆ దురాచారాన్ని వీడాలన్నారు. ఆడపిల్ల ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని అన్నారు. మహిళలు కుటుంబం కోసం త్యాగాలను తగ్గించి తమ ఆరోగ్యంపై సారించాలని సూచించారు. ఏసీపీ మాధవి మాట్లాడుతూ బాలికా సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి ఎం.సరస్వతి, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, సీడబ్ల్యూసీ సభ్యురాలు రాధ పాల్గొన్నారు.



బాలిక విన్యాసం

స్మార్ట్‌కార్డులు

వచ్చేశాయ్..

- ప్రారంభమైన ఆర్సీల ప్రింటింగ్
- తొలగనున్న వాహనదారుల ఇబ్బందులు

\- తిమ్మాపూర్, ఆంధ్రజ్యోతి

7

ఎస్‌యూ వీసీగా బాధ్యతలు చేపట్టిన

ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్

\- గణేశ్‌నగర్, ఆంధ్రజ్యోతి

7

ధాన్యం కొనుగోలు కేంద్రాల జాడేది..?

- తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న దళారులు
- పట్టించుకోని అధికారులు

\- హుజూరాబాద్, ఆంధ్రజ్యోతి

8

చదువుతోపాటు

క్రీడల్లోనూ రాణించాలి

- ముగిసిన జిల్లా ఎస్‌జీఎఫ్ ఖో-ఖో, అథ్లెటిక్స్ పోటీలు
- ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్



ఖో-ఖో పోటీల్లో తలపడుతున్న బాలురు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఒలింపిక్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్ అన్నారు. జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం జిల్లాస్థాయి-14 బాలబాలికలకు ఖో-ఖో పోటీలు, అండర్-14, అండర్-17 జిల్లాస్థాయి బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లాలోని 16 మండలాల నుంచి 450 మంది ఖో-ఖో క్రీడాకారులు, 280 మంది అథ్లెటిక్స్ క్రీడాకారులు హాజరై ప్రతిభ చాటారు. అంబేద్కర్ స్టేడియంలో ఖో-ఖో క్రీడాకారులను పరిచయం చేసుకుని నందెల్లి మహిపాల్ మాట్లాడారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం విద్యార్థులకు అన్ని క్రీడల్లో పోటీలను నిర్వహిస్తుందన్నారు. పీటీసీ సీఐ కుమారస్వామి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రతిభచాటిన క్రీడాకారులను జగిత్యాలలో నిర్వహించనున్న కరీంనగర్ జోనల్ స్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో టీజీ పెటా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సొల్లు సారయ్య, అంతటి శంకరయ్య, పెటా టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె కృష్ణ, ప్రతినిధి బాబు శ్రీనివాస్, ఖో ఖో పోటీల కన్వీనర్ వంగపల్లి సూర్యప్రకాశ్, బిట్ర శ్రీనివాస్, కట్ట సంతోష్, వ్యాయామ ఉపాధ్యాయులు వి శ్రీలత, పి జ్యోతి, జి రేణుక, దత్తాత్రేయ, అశోక్, బి రాజగోపాలాచారి, కె సమ్మయ్య, హరికిషన్, ఎస్ రమేష్, బాలు శేఖర్, రేణుక, కరుణాకర్, అనిల్ పాల్గొన్నారు.

- ఖో-ఖో పోటీల విజేతలు...

బాలుర విభాగంలో మానకొండూర్ మండల ప్రథమ స్థానం, కరీంనగర్ రూరల్ మండలం ద్వితీయ స్థానంలో నిలిచాయి.. బాలికల విభాగంలో గంగాధర మండలం ప్రథమ స్థానం, కరీంనగర్ అర్బన్ జోన్ ద్వితీయ స్థానంలో నిలిచాయి.

తూకం వేసిన 48 గంటల్లో

రైతుల ఖాతాల్లో నగదు

- సన్న వడ్లకు రూ. 500 బోనస్
- అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్




సైదాపూర్ మండలం దుద్దెనపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్

సైదాపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని తూకం వేసిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్ అన్నారు. అన్నారు. శనివారం ఆమె సైదాపూర్ మండలంలోని దుద్దెనపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులు తమ ధన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి, శుభ్రపరిచి కొనుగోలు కేంద్రానికి తీసుక రావాలన్నారు. సన్న వడ్లకు ప్రభుత్వం 500 రూపాయల బోనస్ ఇస్తున్నదని, సన్న వడ్లను, దొడ్డు వడ్లను వేరు వేరు కుప్పలు పోయించాలన్నారు. ధాన్య తూకం వేసేటప్పుడు రైతులు విధిగా పట్టాదారు పుస్తకం, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్‌కార్డ్ ఇవ్వాలన్నారు. ఈ సారి కొత్తగా ఓటీపీ, ఐరిస్ ద్వారా రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కొత్త తిరుపతి రెడ్డి, తహసీల్దార్ మంజుల, సీఈవో శ్రీధర్ పాలొన్నారు.

- ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి..

చిగురుమామిడి: ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని అదనపు కలెక్టర్ కె లక్ష్మికిరణ్ రైతులకు సూచించారు. శనివారం మండలం కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించినారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముద్దసాని రమేష్, ఎంపీడీవో ఎండీ ఖాజామొయినొద్దీన్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు అన్వర్, రెవిన్యూ పరిశీలకులు అరుణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్, ఏపీఎం మట్టెల సంపత్‌కుమార్, సీసీ సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, వివోలు సుజాత, రజిత, కనకవ్వ, జ్యోతి పాల్గొన్నారు.

సమీకృత మార్కెట్లు, కళాభవన్‌ను పూర్తి చేయండి



కలెక్టర్ పమేలాసత్పతికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 19: కరీంనగర్‌లో సమీకృత మార్కెట్లు, అమృత వర్షిణి సాంస్కృతిక కళాభవనం నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం ఆయన కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి నియోజకవర్గ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, సమస్యలపై చర్చించి వినతిపత్రం అందజేశారు. సమీకృత మార్కెట్ పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా కాంట్రాక్టర్ సగంలో నిలిపివేశారన్నారు. ఎస్సారార్ కళాశాల ఆవరణలో నిర్మిస్తున్న అమృత వర్షిణి సాంస్కృతిక కళాభవనం (ఆడిటోరియం) పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. నిధులు విడుదల కాకపోవడంతో ఆ పనులు నిలిచిపోయాయని తెలిపారు. కొత్తపల్లి మున్సిపల్ పరిధిలోని సర్వే నంబర్ 272 లోని ప్రభుత్వ భూమిలో మూడు దశాబ్దాల క్రితం ఎస్సీ, బీసీ నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలను మంజూరు చేశారని, ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలు జరగలేదన్నారు. వెంటనే వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జంగిలి సాగర్, దిండిగాల మహేశ్, జడ్పీ మాజీ కో ఆప్షన్ సభ్యుడు జమీలొద్దీన్, నాయకులు తుల బాలయ్య, కోల సంపత్, దావా కమలామనోహర్, కర్ర సూర్యశేఖర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మినీ వ్యాన్

● ఇద్దరి మృతి




సంఘటన స్థలంలో వాహనాలు, మృతులు (ఫైల్)

తిమ్మాపూర్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండల పరిధిలోని రాజీవ్‌రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు చికిత్స పొందుతూ మృతిచెందారు. ఎల్ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూక్యా రాజు(40), లావుడియా వాగ్య(29) ఇద్దరు సొంత బావ, బావమరుదులు. వీరిది సిద్దిపేట జిల్లా ధూలిమిట్ట మండలం కూటిగల్ గ్రామ పంచాయతీ పరిధిలోని చర్చ్ తండాకు చెందిన వారు. గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూనే సెల్‌టవర్స్ కేబుల్ పనులు(ఎలక్ట్రికల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్స్)గా రాష్ట్ర వ్యాప్తంగా పనులు చేస్తూ ఉంటారు. లావుడియా వాగ్యకు రెండు నెలల క్రితం బాబు పట్టాడు. కాగా బాబు అనారోగ్యంతో జనగామలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాబును చూసేందుకు ఇద్దరు కలిసి ఆదిలాబాద్‌లో పనులు ముగించుకొని జనగామకు తమ మినీవ్యాన్‌లో బయలుదేరారు. ఈ క్రమంలో తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీ వద్ద మహిళా ప్రాంగణం సమీపంలో శుక్రవారం రాత్రి 11గంటల సమయంలో ఓ లారీని డ్రైవర్ రాజీవ్ రహదారిపై నిలిపివేశాడు. ఇండికేటర్ లైట్స్ కూడా వేయక పోవడంతో చీకట్లో లారీ కనిపించలేదు. దీంతో మినీవ్యాన్ వేగంగా లారీని ఢీకొని కిందకు వెళ్లింది. వ్యాన్ నడుపుతున్న వాగ్యతో పాటు భూక్య రాజు వాహనంలో ఇరుక్కుపోయారు. చాలా సేపు వరకు వాహనంలోనే ఇద్దరు ఇబ్బంది పడ్డారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు, స్థానికులు శ్రమించి ఇద్దరిని వాహనంలో నుంచి బయటకు తీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం మేరకు ఎల్ఎండీ పోలీసులు అక్కడికి చేరుకుని లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గాయపడ్డ భూక్య రాజు, లావుడియా వాగ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారు జామున మృతి చెందారు. సొంత బావ, బావమరుదులు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివేక్ తెలిపారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

హుజూరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుడగజంగం కాలనీకి చెందిన బాలిక అదృశ్యమైనట్లు తల్లిదండ్రులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం సాయంత్రం కిరాణ షాపునకు వెళ్లిన బాలిక ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులను ఆరా తీశారు. ఆచూకీ లభించ లేదు. కాగా ఇదే ప్రాంతానికి చెందిన శేఖర్ అనే వివాహితుడు సైతం కనబడకుండా పోవడంతో అనుమానించిన బాలిక తల్లిదండ్రులు అతడిపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

కత్తితో బెదరించి చోరీకి యత్నం

● నిందితుడి కోసం పోలీసుల గాలింపు

మంథని, అక్టోబర్ 19: మండలంలోని గుంజపడుగు గ్రామంలో మినీ ఏటీఎంలో ఓ దుండగుడు కత్తితో బెదిరించి చోరీకి శుక్రవారం రాత్రి విఫల యత్నం చేశాడు. పోలీసుల కథనం ప్రకారం..మూస రజిత గ్రామంలో మినీ ఏటీఎం నిర్వహిస్తుండగా హఠాత్తుగా ఓ దుండగుడు ముసుగు ధరించి చేతిలో కత్తితో మినీ ఏటీఎంలోకి ప్రవేశించాడు. రజితను బెదిరించి డబ్బులు ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించగా ఆమె అరవడంతో దుండగుడు అక్కడి నుంచి పారిపోయాడు. గ్రామస్థులు పట్టుకోవడానికి ప్రయత్నించినా సాధ్యం కాలేదు. రజిత పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీసీ టీవీ పుటేజీలను పరిశీలిస్తున్నారు. దొంగ ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ రమేష్ కోరారు.

క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్ పేర్లతో పెట్టుబడులు

- మోసాలకు పాల్పడుతున్న ముఠా - ఐదుగురి అరెస్టు

జగిత్యాల క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్ పేర్లతో పెట్టుబడులు పెట్టిస్తూ ప్రజలను మోసాలకు గురిచేస్తున్న ముఠాను జగిత్యాల పోలీసులు గుట్టురట్టు చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ముఠా సభ్యుల వివరాలతో పాటు మోసాలకు పాల్పడిన తీరును టౌన్ సీఐ వేణుగోపాల్ వివరాలు వెల్లడించారు. జగిత్యాల పట్టణంలోని అరవింద్‌నగర్‌కు చెందిన గుమ్మడి నర్సయ్య, కోయల్‌కర్ వేణు, ఆరే రాజేష్ కుమార్, కురెల బాబు, తాటిపెల్లి గ్రామానికి చెందిన కొట్టె మారుతీలతో పాటు కొంత మంది క్రిప్టో కరెన్సీ, బిట్ కాయిన్ పేర్లతో పెట్టుబడులు పెట్టించే ముఠాగా ఏర్పడ్డారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బులు ఆశ చూపిస్తూ ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, అమాయక ప్రజలను నమ్మించి ఆన్‌లైన్ కాయిన్ వ్యాపారం గురించి వివరిస్తూ డబ్బులు పెట్టుబడులు పెట్టిస్తూ ఈజీ మనికి అలవాటు పడ్డారు.

జిల్లా కేంద్రంలో మొదలైన ఈ దందా పెగడపల్లి మండలం బతికపెల్లి, తాటిపెల్లితో పాటు అన్ని ప్రాంతాల్లో విస్తరింపజేశారు. ఈ ముఠా సభ్యులు రెక్సాస్ ట్రేడ్ యాప్ అనే ఆన్‌లైన్ ట్రేడ్ యాప్ ద్వారా యూఎస్‌డీటీ బీఈపీ-20 అనే క్రిప్టో కరెన్సీలో లక్షలాది రూపాయలను పెట్టుబడులు పెట్టించారు. పెట్టిన పెట్టుబడి 18 నెలల్లో ఐదు నుంచి 10 రెట్లు వస్తాయని దీనికి తమది పూచికత్తు అంటూ నమ్మబలికారు. ఇలా ఎంత మందిని చేర్పిస్తే అంత లాభాలు వస్తాయంటూ వందలాది మందితో పెట్టుబడులు పెట్టించి నెలకు కొంత సొమ్మును వారికి ట్రస్ట్ వ్యాలెట్ ద్వారా చెల్లిస్తూ వ్యాపారాన్ని విస్తరించారు.

కొద్ది రోజులుగా యాప్ సరిగా పనిచేయకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ ముఠాను గుట్టు రట్టు చేశారు. శనివారం ఐదుగురితోపాటు మరికొంత మందిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా వాసులు మోసపూరిత ట్రేడింగ్ యాప్‌లో కష్టపడి సంపాందించిన డబ్బులు పెట్టుబడులు పెట్ట వద్దని కోరారు. ఇలాంటి వ్యాపారాలు చేసే వ్యక్తుల సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

హాస్టల్ నుంచి విద్యార్థులు అదృశ్యం

● కొండగట్టులో గుర్తించిన పోలీసులు



కొండగట్టు పోలీసుల అదుపులో విద్యార్థులు

మానకొండూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్‌లోని సమీకృత హాస్టల్‌లో ఉంటూ బాలుర ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు శుక్రవారం అదృశ్యమయ్యారు. రాత్రి జగిత్యాల జిల్లా కొండగట్టు హనుమాన్ ఆలయ ప్రాంగణంలో పోలీసులు గుర్తించి హాస్టల్ సిబ్బందికి అప్పగించారు. చొప్పదండి మండలంలోని చాకుంట గ్రామానికి చెందిన ఆకుల నితీష్ (11), మానకొండూర్ మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామానికి చెందిన మద్దంకుల శ్రీనివాస్ (11) వెనుకబడిన సమీకృత హాస్టల్ ఉంటు చదువుకుంటున్నారు. శుక్రవారం హాస్టల్ నుంచి ఇద్దరు చిన్నారులు చెప్పాపెట్టకుండా బయటకి వెళ్లారు. హాస్టల్ వార్డెన్, సిబ్బంది మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చుట్టుపక్కల పోలీస్‌స్టేషన్‌లను అప్రమత్తం చేశారు. మానకొండూర్ నుంచి కరీంనగర్ చేరుకున్న విద్యార్థులు జగిత్యాల వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కి కొండగట్టు దిగువన దిగారు. ఓ బొమ్మల వ్యాపారికి అనుమానాస్పదంగా కనిపించడంతో ఆరా తీసి అక్కడి పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని భోజనం చేయించిన అనంతరం మానకొండూర్ పోలీసులకు అప్పగించారు.

కెరీర్

భవితకు భరోసా

నాగారం

వృత్తి విద్య శిక్షణ కేంద్రం యువత ఉపాధికి భరోసా ఇస్తోంది. నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్, నర్సింగ్, టైలరింగ్ వంటి కోర్సుల్లో శిక్షణ ఇస్తూ ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. ఏడేళ్లలో 1300 మంది యువతీయువకులకు శిక్షణ ఇవ్వగా 1000 మందికి పైగా వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలు పొందారు.

- నాగారంలో ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రం
- ఏడేళ్లుగా నిర్వహణ
- ఇప్పటి వరకు 1300 మందికి శిక్షణ
- మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు ప్రోత్సాహంతో కొనసాగింపు



నాగారంలో ఏర్పాటు చేసిన జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రం

నర్సింగ్ కోర్సులో శిక్షణ పొందుతున్న యువతులు

కోనరావుపేట, అక్టోబరు 19: కోనరావుపేట మండలం నాగారంలోని వృత్తి విద్య శిక్షణ కేంద్రం యువత భవిష్యత్‌కు భరోసా కల్పిస్తోంది. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్న మనేని విద్యాసాగర్ రావు ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కోనరావుపేట మండలం నాగారంలో పుట్టి పెరిగిన చెన్నమనేని విద్యాసాగర్ రావు యువత కోసం గ్రామంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సహకారంతో శిక్షణ కేంద్రాన్ని ఏడు సంవత్సరాల క్రితం ప్రారంభించి విజయవంతంగా కొనసాగిస్తున్నారు. 2017 సెప్టెంబరు 2న శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం శిక్షణ కేంద్రంలో ఎలక్ట్రీషియన్, నర్సింగ్, టైలరింగ్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. నాలుగు సంవత్సరాల క్రితం ఎలక్ట్రీషియన్, నర్సింగ్, టైలరింగ్‌తోపాటు బైక్ మెకానిక్ కోర్సులోనూ శిక్షణ ఇచ్చారు. ఇప్పటి వరకు 1300 మంది యువతకు శిక్షణ ఇచ్చి 1000 మందికి వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాలను కల్పించి వారి భవితకు భరోసా నింపారు. శిక్షణ కేంద్రంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత శిక్షణ, భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన యువతీయువకులకు సర్టిఫికెట్లను అందజేస్తున్నారు. శిక్షణ పూర్తయిన యువత వివిధ ప్రాంతాల్లో ఉద్యోగాల్లో స్థిర పడ్డారు.

శిక్షణ కేంద్రం బాగుంది.

- ఎండీ సాజీనా, రాళ్లపేట



జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రం బాగుంది. నేను నర్సింగ్ కోర్సులో శిక్షణ పొందుతున్నాను. ఉచితంగా శిక్షణ, భోజన వసతి కల్పించి సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. సర్టిఫికెట్ పొందిన అనంతరం ఈ ఫౌండేషన్ వారే ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందడం చాలా సంతోషంగా ఉంది.

టైలరింగ్ శిక్షణ పొందుతున్నా

- గీతాంజలి, మర్తనపేట



జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రంలో నేను టైలరింగ్ శిక్షణ పొందుతున్నాను. ఇందులో అన్ని వసతులు కల్పిస్తూ శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ అందజేస్తున్నారు. సర్టిఫికెట్‌తో ఎక్కడైనా పని చేసుకోవచ్చనే భరోసా ఉంది. ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు.

ఇప్పటికి 60 బ్యాచ్‌లు పూర్తి చేశాం

- వరలక్ష్మి ఫౌండేషన్ వృత్తి విద్య శిక్షణ కేంద్రం ఇన్‌చార్జి మహేష్



నాగారంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ సహకారంతో మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు ప్రోత్సాహంతో ఉచిత వృత్తి విద్య శిక్షణ కేంద్రాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నాం. ఇప్పటి వరకు 60 బ్యాచ్‌లను పూర్తి చేశాం. ప్రస్తుతం ఎలక్ట్రీషియన్, నర్సింగ్, టైలగింగ్ కోర్సులను నిర్వహిస్తున్నాం. 1300 యువతీ యువకులు శిక్షణ పొందారు. వెయ్యి మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాం. నిరుద్యోగ యువతకు శిక్షణ ఎంతగానో దోహదపడుతుంది.



శిక్షణ పొందిన యువకులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు (ఫైల్)



ఎలక్ట్రీషియన్‌లో శిక్షణ పొందుతున్న యువకులు

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయులు

మానకొండూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో ఓ విద్యార్థిని ఉపాధ్యాయులు చితకబాదిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి.. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఎ ఆదిత్య అనే విద్యార్థి పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ప్రార్థన ముగిసిన తర్వాత తరగతి గదిలోకి అందరితో పాటు ఆదిత్య వెళుతుండగా ఉపాధ్యాయులు జయసింగ్, శ్రీనివాస్ క్రమశిక్షణ పాటించడం లేదంటూ తీవ్రంగా కొట్టారు. ఆ దెబ్బలకు తట్టుకోలేక ఆదిత్య కింద పడి స్పృహ కోల్పోయాడు. కంగారుపడ్డ ఉపాధ్యాయులు వెల్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. పోచంపల్లి ఆదర్శ పాఠశాలలో విద్యార్థి ఆదిత్యను ఇద్దరు ఉపాధ్యాయులు జయసింగ్, శ్రీనివాస్‌లు చితకబాదిన సంఘటనపై డీఈవో జనార్దన్‌రావు శనివారం పాఠశాలలో విచారణ జరిపారు. ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరుగవద్దన్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ పోటీలు



కరీంనగర్‌లో లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారిణి



సుల్తానాబాద్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అధికారులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన అండర్-19 ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్, హాకీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. అండర్-19 ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి మధు జాన్సన్, జిల్లా యువజన క్రీడా అధికారి శ్రీనివాస్‌గౌడ్, సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయరఘునందన్‌లు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగి రాష్ట్రానికి గుర్తింపు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యా ర్థులకు అథ్లెటిక్స్‌లోని రన్స్, జంప్స్ త్రోస్ అంశాలలో పోటీలను నిర్వహించారు. హాకీ క్రీడలను నిర్వహించి ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సాయంత్రం విజేతలకు పతకాలను అందించారు. కార్యక్రమంలో కోచ్ మార్కండేయ, పీడీలు ఎస్నేక్, సుష్మ, సరిత, దస్తగిరి, వికాస్, గౌతమ్, విష్ణు, రాజశేఖర్, అఖిల్, మహ్మద్ తారీక్ అలీ, నారాయణ పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో ఎస్జీఎఫ్ ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

సుల్తానాబాద్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని పెద్దపల్లి జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి సురేష్ అన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను శనివారం సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, ఎస్ఐ శ్రావణ్ కుమార్, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్, ప్రిన్సిపాల్ రాంచంద్రారెడ్డి, ఎస్జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, యూనిక్ పాషా పాల్గొన్నారు.

ఆదర్శం

పుట్టిన ఊరిపై మమకారం..



చల్మెడ లక్ష్మీనర్సింహారావు

- మల్కపేటలో ఆధునిక వసతులతో పాఠశాల భవనం
- నిర్మాణం చేపట్టిన చల్మెడ కుటుంబ సభ్యులు
- గ్రామాభివృద్ధి లక్ష్యంగా పనులు



పాఠశాల గదిలో ఏర్పాటు చేసిన బెంచీలు వివిధ రకాల బొమ్మలు

కోనరావుపేట, సెప్టెంబరు 19 : పుట్టిన ఊరిపై మమకారంతో భవిష్యత్ తరాలకు ఆధునిక వసతుల మధ్య విద్యనందిస్తున్నారు. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో మాజీ న్యాయశాఖ మంత్రి చల్మెడ ఆనందరావు కుటుంబ సభ్యులు ఆయన తన తల్లి జానకి దేవి జ్ఞాపకార్థం సుమారు రెండు కోట్ల రూపాయలతో ప్రభుత్వ పాఠశాల భవనాన్ని నిర్మించారు. రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వ హయాంలో 'మన ఊరు మన బడి' కార్యక్రమంలో భాగంగా భవనాన్ని ప్రారంభించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అందిస్తున్నారు. మల్కపేట గ్రామ విద్యార్థులతోపాటు చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు.



మల్కపేటలో నిర్మించిన ఆధునిక పాఠశాల భవనం

గ్రామాన్ని అభివృద్ధి చేయాలనే తపన

- చల్మెడ ఆనందరావు, మాజీ మంత్రి



మల్కపేట గ్రామంలో పుట్టి పెరిగిన మా కుటుంబానికి గ్రామాన్ని ఏదో విధంగా అభివృద్ధి చేయాలనే తపన ఉంది. అందుకే ఆధునిక సౌకర్యాలతో పాఠశాల భవనం నిర్మించాం. శుద్ధ జల కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. మహిళా సంఘం భవనానికి నిధులు కేటాయించాం. మల్కపేట కట్టపై ఆరు కోట్లతో రామాలయ నిర్మాణం చేపట్టాం. అది త్వరలో పూర్తి చేస్తాం.

నలుగురు దొంగల అరెస్ట్

● నాలుగు బైక్‌లు స్వాధీనం

శ్రీరాంపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బైక్‌లు దొంగిలించి విక్రయించడానికి తీసుకెళ్తుండగా శ్రీరాంపూర్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ వివరాలు వెల్లడించారు. గోదావరిఖనికి చెందిన ఆజ్మీరా అక్షయ్ కుమార్, దొంతుల ప్రశాంత్, దేవ సహాయం సెల్వ, చిట్యాల పృథ్వీ అను నలుగురు యువకులు బైక్‌లపై గోదావరిఖని వైపు నుంచి మంచిర్యాల వైపు వెళ్తూ జీఎం కార్యాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసుల కంటపడ్డారు. వెంటనే వారిని ఆపి డాక్యుమెంట్లు చూపించాలని కోరగా, వారు ఎలాంటి వాహన పత్రాలు చూపలేదు. దీంతో అదుపులోకి తీసుకొని విచారణ చేయగా, నలుగురు యువకులు గత నెల రోజులుగా ఎలాంటి పని లేకుండా, చెడు అలవాట్లకు, జల్సాలకు బానిసయ్యారని తెలిసింది. డబ్బు కోసం శ్రీరాంపూర్, జైపూర్, రామగుండం ఏరియాలలో నాలుగు బైక్‌లను దొంగిలించారు. వాటిని గోదావరిఖనిలో విక్రయిస్తే దొంగతనం బయటపడుతుందని భావించి మంచిర్యాలలో అమ్మేందుకు తీసుకెళ్తుండగా, శ్రీరాపూర్ జీఎం కార్యాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. బైక్‌లను స్వాధీనపర్చుకొని, నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ వివరించారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్ఐలు సంతోష్, లక్ష్మీప్రసన్నలను ఏసీపీ అభినందించారు.

దత్తాత్రేయస్వామి ఆలయానికి బోటు సౌకర్యం

- ఎంపీ నిధులతో కొనుగోలు


బోటులో ప్రయాణిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బోయినపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలం వరదవెల్లి దత్తాత్రేయ స్వామి ఆలయానికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ బోటు సౌకర్యం కల్పించారు. దత్తాత్రేయ స్వామి గుట్ట చుట్టూ మిడ్ మానేరు బ్యాక్ వాటర్ విస్తరించి ఉండడంతో నిత్య పూజలకు ఇబ్బందులు తలెత్తేవి. కొద్ది నెలల క్రితం దత్తాత్రేయస్వామి గుట్టపై జరిగిన స్వామి వారి జయంత్యుత్సవాలకు బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారి దర్శించుకునేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని బండి సంజయ్ దృష్టికి ఆలయ కమిటీ సభ్యులు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన బండి సంజయ్ స్వామివారిని దర్శించుకునేందుకు భక్తుల సౌకర్యం కోసం రూ.10 లక్షల మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ నిధులతో బోటును కొనుగోలు చేసి శనివారం ఆలయానికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు బోటును ప్రారంభించి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

మిడ్‌మానేరు ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో

బోయినపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ఎల్ఎండీ ప్రాజెక్ట్‌కు రెండు గేట్ల ద్వారా 4,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల ప్రస్తుతం 317.17, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు పస్తుతం 26.86 టీఎంసీల మేర ఉంది.

ఎస్‌యూ వీసీగా ఉమేష్ కుమార్ బాధ్యతలు


వీసీగా బాధ్యతలు తీసుకుంటున్న ప్రొఫెసర్ ఉమేష్ కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయం ఉపకులపతిగా శనివారం హైదరాబాద్ సచివాలయంలో ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి వీసీగా విధులు నిర్వహిస్తున్న ఐఏఎస్ అధికారి సురేంద్ర మోహన్‌ను సచివాలయంలో కలసి ఉపకులపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శాతవాహన యూని వర్సిటీ సిబ్బంది వీసీ ఉమేష్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఆచార్య ఉమేష్‌కుమార్ సోమవారం ఉదయం 11 గంటలకు యూనివర్సిటీ ప్రాంగణానికి రానున్నారు.

రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారుగా ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత



గణేశ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారులను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది. శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాతకు ఇందులో చోటు దక్కింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె 22 ఏళ్లుగా సోషియాలజీ బోధిస్తున్నారు. సూరేపల్లి సుజాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దళిత మహిళా సాధికారతపై పీహెచ్‌డీ చేశారు.

జాతీయస్థాయి క్యాంపునకు ఎంపికైన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

గణేశ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ జాతీయ సేవా పథకం విభాగానికి చెందిన పది మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు జాతీయ స్థాయిలో నిర్వహించబడే అడ్వెంచర్ క్యాంపునకు ఎంపికైనట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు శనివారం తెలిపారు. అక్టోబరు 22నుంచి 31 వరకు హిమాచల్‌ప్రదేశ్‌లో అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంప్ నిర్వహిస్తారని తెలిపారు. ఈ అడ్వెంచర్ క్యాంపునకు కంటిన్జెంట్ లీడర్‌గా ఎస్ఆర్ ఆర్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ పడాల తిరుపతి వ్యవహరిస్తున్నారు. ఎంపికైన వలంటీర్లను శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, శాతవాహన యూనివర్సిటీ జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ మనోహర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కంచు తిరుపతి, డాక్టర్ రాజేశం, డాక్టర్ అర్జున్, డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ ఆడెపు శ్రీనివాస్, డాక్టర్ స్వప్న, డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ అనిల్, అధ్యాపకులు పాల్గొన్నారు.


జాతీయస్థాయి క్యాంపునకు ఎంపికైన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఆదివారం ప్రత్యేకం



'సూడు...సూడు మని..చుట్టం ఇంటికి వస్తే చాయ బొట్టు పోద్దామంటే కసికెడన్ని పాలు కూడా లేక పాయే'..

అనే మాటలు గతంలో గ్రామీణ ప్రాంతాల్లో వినిపించేవి. ఈ మాటలు చాయ మారుమూల పల్లె ప్రజల పానీయంగా మారి వారి జీవితాలతో ఎలా పెనవేసుకొని పోయిందో దర్పణం పడుతున్నాయి. కాస్మోపాలిటన్ నగరం నుంచి పల్లెటూరి ప్రజల వరకు చాయ తాగందే తెల్లవారదు. చాయ మన భారతీయ పానీయం కాదు.. బ్రిటిష్ వాళ్లు మనల్ని పాలించిన సమయంలో అది దేశంలోకి ప్రవేశించి ఇక్కడి ఆహారపానీయాల్లో ఒకటిగా కలగలిసి పోయింది. ఇంటికి మిత్రులో... చుట్టాలో వస్తే మంచినీరు, చాయ అందించడం కనీస మర్యాదగా మారిపోయింది. దీంతో ఊరూరా..నగరాల్లో వాడవాడనా...చాయ్ దుకాణాలు వెలిశాయి. ఉదయం పూట మాత్రమే చాయ్ తాగే అలవాటు ఉండేది. క్రమేపీ సాయంత్రం టీ తాగడం అలవాటైంది. ఇప్పుడు ఒక్కొక్కరు నాలుగైదేసి సార్లు తాగనిదే రోజు గడవని స్థితికి చేర్చింది.

◆ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్





కార్పొరేట్ చాయ్

- అందుబాటులోకి వివిధ రకాల టీలు
- రూపుమారిన టీ కొట్లు
- రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ

ప్రజలు చాయ్ తాగకుండా ఉండలేని తనాన్ని కార్పొరేట్ రంగం తన వ్యాపారంగా మార్చుకున్నది. ఎవరు చాయ్ చేసినా తేయాకు మాత్రమే వినియోగించాల్సి ఉన్నా కార్పొరేట్ రంగం రకరకాల బ్రాండ్ ఇమేజ్‌లను సృష్టించి వ్యాపారాన్ని కొత్త పుంతలు తొక్కించింది. పూర్వకాలంలో గుడిసె హోటళ్లలో బొగ్గుల పొయ్యి మీద చాయ కాచి కేతిర్లలో నిలువచేసి అమ్మేవారు. ఆ తర్వాత చిన్నచిన్న హోటళ్లు వెలిశాయి. ఆ తర్వాత చాయ డబ్బాలు వచ్చాయి. ఇప్పుడు ఆ చాయ కాస్త రకరకాల బ్రాండ్ పేర్లతో సొంత వ్యవస్థను ఏర్పాటు చేసుకొని ప్రజలను ఆకర్షిస్తున్నది. మార్కెట్‌లో చాయ్ వాలా, బాబాయ్, టీ పాయింట్, టీ టైం, ఆర్మీ వాలా చాయ్, బెల్లం చాయ్, అమృతతుల్య, టీ కింగ్స్, ఇండియన్ కింగ్స్ వంటి ఎన్నో పేర్లతో ప్రత్యేక టీస్టాళ్లు వెలిశాయి. ప్రజలకు కొత్తకొత్త కార్పొరేట్ రుచులను చూపిస్తున్నాయి. ఈ స్టాళలను ఏర్పాటు చేయడానికి నిర్వహకులు మూడు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయలు ఆయా కంపెనీలకు చెల్లిస్తే టీపాయింట్ ఏర్పాటు చేసుకోవడానికి ఒక సెటప్‌ను ఇచ్చి టీ చేయడంలో శిక్షణ కూడా ఇస్తారు. తమకు మాత్రమే సొంతమైన రుచిగల టీ పౌడర్‌ను సమకూర్చుతారు. ఆ టీపౌడర్‌ను వాడి మాత్రమే టీ తయారు చేయాల్సి ఉంటుంది. కార్పొరేట్ టీపాయింట్లు రావడంతో అంతకుముందే విస్తరించి ఉన్న రాజస్థాన్ టీస్టాళ్ళవారు, ఇతర టీకొట్లు కొత్తకొత్త రుచులను అందించి తమ గిరాకీని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. రుచికి రుచి ఆరోగ్యానికి ఆరోగ్యం అంటూ కొత్తకొత్త టీ తయారు చేసి వినియోగదారులకు అందిస్తున్నారు.


టీ తాగుతున్న నగరవాసులు



● ఎన్నో రకాలు

దమ్‌టీ, జింజర్‌టీ, గ్రీన్‌టీ, బేసిల్ టీ, బెల్లం టీ, పింక్ టీ, లెమన్‌గ్రాస్ టీ, ఇమ్యూనిటీ టీ, లెమన్ టీ, తులసీ టీ, మసాలా టీ, కుల్హడ్ టీ, బ్లాక్‌టీ, కశ్మీరి చాయ్, ఇరానీ టీ, కాఫీ, సూపర్ హెర్బ్స్ అశ్వగంధ్‌టీ వంటి టీ లను ఇస్తూ ప్రజలకు కొత్త రుచులు చూపుతున్నారు. గతంలో టిఫిన్, భోజన హోటళ్లలో టీ తయారు చేసి ఇచ్చే వారు. ఇప్పుడు వారు కాస్తా తమకు అనుబంధంగా టీ దుకాణాలను ఏర్పాటు చేయించి వారి నుంచి కొంత కమీషన్ తీసుకొని చాయ అమ్ముకునే అవకాశం కల్పిస్తున్నారు. కార్పొరేట్ టీ పాయింట్లలో ప్రత్యేక రుచి ఉండడంతో వాటిని నచ్చిన వారు ఆ ప్రత్యేక టీ పాయింట్లకే వెళ్లి టీ తాగుతుండడంతో కొన్ని టిఫిన్ సెంటర్లలో చాయ, కాఫీ ఇవ్వడం మానేశారు. మొత్తానికి బ్రిటీష్ వాళ్ళు ఫ్రీగా అందించి అలవాటు చేసిన టీ ఇప్పుడు కార్పొరేట్ రుచులతో ప్రజల అందుబాటులోకి వచ్చింది.



లాభాలు బాగానే ఉన్నాయి...

- కూస శేఖర్, కలెక్టరేట్ టీ టైం

కలెక్టరేట్ ప్రాంతం కావడంతో లాభాలు బాగానే ఉన్నాయి. టీ టైం కంపనీకి 4.5 లక్షలు చెల్లించి వ్యాపారం చేసుకుంటున్నాం. ప్రతీ నెలా ఆర్డర్ చేస్తే మెటీరియల్ వాళ్లే పంపిస్తారు. షాపు నిర్వహణ కోసం ఓ షెట్టర్ కిరాయి తీసుకున్నాం... నా ద్వారా కొందరు ఉపాధి పొందుతున్నారు.

చాయ్ చాలా బాగుంది..

- మల్లేశ్

చాయ్ చాలా ఉంది. ఎప్పుడు వచ్చినా ఇక్కడే తాగుతా. ఉత్సాహం, ఉత్తేజం కలుగుతుంది. నాణ్యత, ప్రమాణాలతో కూడిన తేనీరు అందిస్తున్నారు.

ఇరానీ చాయ్‌కు ప్రాధాన్యం

-షాహిద్‌ఖాన్, ఎల్లో కేఫ్ నిర్వాహకుడు

విద్యాసంస్థలకు నిలయమైన ముఖరంపురలో విద్యార్థులు, యువత ఇరానీ చాయ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. పాలను బాగా మరగబెట్టి నాణ్యమైన చాయ్‌పత్తాలను వాడి చాయ్ తయారు చేస్తాం. పాలకు కూడా గిరాకి ఉంటుంది. బాగా మరిగిన పాలతో రుచి ఉంటుంది.

బెల్లం టీని ఎక్కువ ఇష్టపడుతున్నారు.

-బి రవి, బెల్లం టీ బ్రాంచెస్ నిర్వాహకుడు

ప్రతిరోజు 600 వరకు బెల్లం టీలు అమ్ముతాం. ఎక్కువగా రిటైర్ ఎంప్లాయిస్, యువత బెల్లం టీ ని ఇష్టపడుతున్నారు. బెల్లం ఆరోగ్యానికి మంచిది. చాయపత్తి, యాలకుల పొడి, బెల్లం పౌడర్ కలిపి కంపెనీ పంపిస్తుంది. ప్రతి 10 రోజులకు ఒకసారి ఆర్డర్ చేస్తాం.

మట్టి కప్పుల్లో స్పెషల్ టీ

- జె అంజయ్య, ఆర్మీ చాయ్ బార్ నిర్వాహకుడు

రెండు సంవత్సరాల క్రితం ఆర్మీ చాయ్ బార్ ఏర్పాటు చేశాం. బాగా నడుస్తుంది. మట్టి కప్పుల్లో టీని ఇస్తాం. ప్రతిరోజు 500 వరకు టీలు అమ్ముతున్నాం.

13 రకాల టీని అమ్ముతున్నాం..

-నితీష్‌కుమార్, అమృతతుల్య టీ సెంటర్

సుమారు 13 రకాల టీ అమ్ముతున్నాం. గిరాకీ బాగా ఉంటోంది. ఎందరో ఈ రకరకాల చాయలను ఆస్వాదిస్తున్నారు. వారి అభిరుచులకు అనుగుణంగా చాయలను అప్పటికప్పుడు తయారు చేసి ఇస్తాం.

నేడు సహకార భారతి రాష్ట్ర సమ్మేళనం

భగత్‌నగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని చింతకుంట గ్రామంలో ఆదివారం సహకార భారతి రాష్ట్ర సమ్మేళనం నిర్వహించనున్నారు. ఈసమ్మేళనానికి వెయ్యిమంది కార్యకర్తలు హాజరు కానున్నట్లు సహకార భారతి రాష్ట్ర సమ్మేళన ప్రముఖ్ న్యాలమడుగు శంకరయ్య తెలిపారు. మహాసభలకు సహకార భారతి జాతీయ సంఘటన మంత్రిసంజయ్ జీ పాచ్పోర్, సహకార భారతి జాతీయ మంత్రి నందినీరాయ్ హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారన్నారు.

పోలీసు కుటుంబాలకు చెక్కులు అందజేత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యం కారణంగా మరణించిన పోలీసు అధికారుల కుటుంబాలకు భద్రత పథకం కింద ఆర్థిక సహాయం చెక్కులను శనివారం అడిషనల్ డీసీపీ లక్ష్మినారాయణ అందజేశారు. సీసీఆర్‌బీలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో మరణించిన కె లింగారెడ్డికి భద్రతా విభాగం నుంచి మంజూరు అయిన 16 లక్షల చెక్‌ను అతని భార్యకు అందజేశారు. అలాగే ఏఆర్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ మరణించిన ఎం శ్రీనివాస్ కుటుంబానికి 8 లక్షలు, ట్రాఫిక్ కానిస్టేబుల్ టి కుమారస్వామి కుటుంబానికి 8 లక్షల రూపాయల చెక్‌లను వారి భార్యలకు అందజేవారు. ఈ కార్యక్రమంలో సీపీఓ, జూనియర్ అసిస్టెంట్ కళ్యాణి పాల్గొన్నారు.



చెక్కులను అందజేస్తున్న అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ

కేంద్ర మంత్రిపై ప్రభుత్వ తీరు అప్రజాస్వామికం

భగత్‌నగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌పై రాష్ట్ర ప్రభుత్వ వ్యవహార శైలి అప్రజాస్వామికమని బీజేపీ సీనియర్‌నాయకుడు కొట్టె మురళీకృష్ణ అన్నారు. నిరుద్యోగులకు సంఘీభావంగా గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతు తెలిపిన కేంద్ర మంత్రిని అరెస్టుచేయడం రాష్ట్ర ప్రభుత్వానికి చేతగాని తనానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు నిరుద్యోగుల పాలిట శాపంగా మారాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న అవగాహన రాహిత్యంతో వివిధ వర్గాల ప్రజలు వేలమంది రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్నారన్నారు. నిరుద్యోగుల పక్షాన మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదన్నారు. జీవో నెంబర్ 29తో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఉద్యోగాల ఉపాధి కల్పనలో రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. గ్రూప్-1 బాధితులకు న్యాయం చేసే విధంగా ప్రభుత్వం వారితో చర్చలు జరపాలన్నారు. రిజర్వేషన్లను రద్దు చేసి బడుగు బలహీన వర్గాల నిరుద్యోగుల పొట్ట కొట్టడమే లక్ష్యంగా జీవో29ని తీసుకువచ్చారన్నారు.

స్మార్ట్ కార్డులు వచ్చేశాయ్..

- ప్రారంభమైన ఆర్సీల ప్రింటింగ్
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొలగనున్న ఇబ్బందులు



తిమ్మాపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖా కార్యాలయాల్లో స్మార్ట్ కార్డుల కొరత తీరనుంది. రవాణా శాఖా కార్యాలయాల్లో స్మార్ట్ కార్డుల కొరత కారణంగా గత నెల 29 నుంచి ఆర్సీ కార్డుల ప్రింటింగ్ నిలిచిపోయింది. 'స్మార్ట్ కార్డుల కొరత శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 14వ తేదీన కథనం ప్రచురితమైంది. ఈ స్మార్ట్ కార్డుల కొరత అనేది కేవలం ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగానే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా నెలకొని ఉంది. కాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరీంనగర్‌లోని డీటీసీ కార్యాలయంతో పాటు హుజూరాబాద్, పెద్దపల్లి, రామగుండం, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, కోరుట్ల ఆర్టీవో కార్యాలయా పరిధిలో కూడా ఆర్సీ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌ల కోసం ప్రతీ రోజు సుమారు వెయ్యి వరకు దరఖాస్తులు వస్తుంటాయి. డ్రైవింగ్ లైసెన్స్‌లకు కార్డులు కొంత మేరకు అందుబాటులో ఉన్నా ఆర్సీ కార్డులు కొరత ఉంది. గత నెల 29 నుంచి ఆర్సీకార్డుల ప్రింటింగ్ కూడా కార్యాలయాల్లో నిలిచిపోయింది. దీంతో కొత్త వాహనాలకు నంబరు ప్లేట్లు బిగించుకోవడానికి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం నాలుగు వేల స్మార్ట్ కార్డులు రవాణా శాఖా కార్యాలయాలకు చేరుకున్నాయి. దీంతో పెండింగ్‌లో ఉన్న ఆర్సీ కార్డులతో పాటు ప్రస్తుత ఆర్సీ కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌ల ప్రింటింగ్ పూర్తి చేసి వాహనాదారులకు పంపించే పనుల్లో రవాణా శాఖా సిబ్బంది నిమగ్నం ఉన్నారు. కార్డులు ప్రింటింగ్ అవుతుండడంతోనే వాటిని సంబంధిత వాహనా దారులకు పోస్ట్ ద్వారా పంపించే ప్రక్రియ కూడా ప్రారంభించారు. మరో రెండు, మూడు రోజుల్లో పెండింగ్‌లో ఉన్న కార్డులను ప్రింటింగ్ పూర్తి చేసి పోస్ట్ ద్వారా సంబంధిత వాహనాదారులకు పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ

స్వామివారిని దర్శించుకున్న దేవాదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు


ధర్మపురిలో క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు


యమధర్మరాజు ఆలయం వద్ద పూజలు చేస్తున్న రామకృష్ణారావు

ధర్మపురి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం స్వామి వారలకు వేదపండితులు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అభిషేకం, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం, నరసింహ హోమం జరిపించారు. రావి చెట్టు అంజనేయ స్వామి విగ్రహం చుట్టు ప్రదక్షిణాలు చేశారు. క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి అనుబంధ యమ ధర్మరాజు ఆలయంలో శనివారం స్వామి వారలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరణి నక్షత్రం సందర్భంగా ఆలయ వేదపండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అప మృత్యు నివారణ కోసం అర్చకులు పూజలు నిర్వహించారు. భక్తులు గండ దీపంలో నూనె పోసి స్వామివారలను దర్శనం చేసుకున్నారు. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ ఎం రామకృష్ణారావు కుటుంబ సమేతంగా శనివారం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, అర్చకులు ఆశీర్వదించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ వారికి స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై విచారణ

కరీంనగర్ రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలో అక్రమ నిర్మాణాలపై అధికారులు విచారణ చేపట్టారు. గ్రామంలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించారని కలెక్టర్ పమేలా సత్పతికి గ్రామానికి చెందిన దొమ్మటి బాబు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఎంపీవో జగన్మోహన్‌రెడ్డి గ్రామంలో విచారణ చేపట్టారు. అక్రమంగా కట్టిన ఇళ్ల వద్దకు వెళ్లి విచారణ చేశారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని ఎంపీవో జగన్మోహన్ రెడ్డి తెలిపారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శి హిదైతుల్లా ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కరీంనగర్ క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం ఆరెపల్లికి చెందిన తిరుపతి అనే వ్యక్తి కొద్ది రోజుల కిందట తన సెల్‌ఫోన్‌ను కరీంనగర్‌లో పోగొట్టుకున్నాడు. ఈ మేరకు ఒకటో ఠాణా పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు అప్‌లోడ్ చేసిన ఎస్ఐ గుడిపెల్లి రాజన్న విచారణచేపట్టి ఫోన్‌ను పట్టుకుని యజమాని తిరుపతికి శనివారం ఠాణాలో అప్పగించాడు.

పుస్తకాల ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 19: నగరంలోని వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో సమైక్య సాహితి ఆధ్వర్యంలో శనివారం యోగా సంపత్‌కుమార్ రచించిన 'విశ్వమంగళ యోగ', 'ఒంటికి యోగా మంచిదేగా' పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి సినారె పురస్కార ప్రదాత, పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఎడవెల్లి విజయేంద్రరెడ్డి, ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ, అవధాని డాక్టర్ గంద్ర లక్ష్మణరావు, సంస్థ అధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్, టు, ఏడిఈ,లు పంజాల శ్రీనివాస్ గౌడ్, ఏం లావణ్యలు తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు డాక్టర్ స్ట్రీట్, శ్రీనగర్, సివిల్ హాస్పిటల్ వెనుక వైపు, గాంధీరోడ్, గర్ల్స్ జూనియర్ కాలేజ్ రోడ్, అహ్మద్‌పురా, రూరల్ పోలీస్ స్టేషన్ ఏరియా, బోయవాడ, గంజ్, టవర్ సర్కిల్, సిఖ్‌వాడి, కమనారియా, సిపి ఆఫీస్ రోడ్, లక్ష్మీనగర్, కమాన్ నుండి హౌసింగ్ బోర్డ్‌రోడ్డు. ఈ ఎన్ గార్డెన్ ఏరియా, ఆంధ్రాబ్యాంక్ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

'ఎమ్మెల్యే గంగులను విమర్శించే అర్హత కాంగ్రెస్‌కు లేదు'



మాట్లాడుతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

కరీంనగర్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ అభివృద్ధి కోసం వందల కోట్ల నిధులను తీసుకువచ్చిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను విమర్శించే అర్హత కాంగ్రెస్ నాయకులకు లేదని బీఆర్ఎస్ కార్పొరేటర్లు స్పష్టం చేశారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ కార్పొరేటర్లు ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ పార్టీపై, మేయర్, డిప్యూటీ మేయర్‌పై చేసిన వాఖ్యలను వారు ఖండించారు. శనివారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్పొరేటర్లు వాల రమణారావు, గందె మాధవిమహేశ్, కంసాల శ్రీనివాస్, దిండిగాల మహేశ్ మాట్లాడుతూ కరీంనగర్‌ను ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ఇలా అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు వందల కోట్లను తీసుకు వచ్చారన్నారు.

నగరంలో తీగలవంతెన ఏర్పాటు చేయిం చారన్నారు. మానేరు రివర్‌ఫ్రంట్ పనులు ప్రారంభించిన ఘనత గంగుల కమలాకర్, మాజీ ఎంపీ వినోద్ కుమార్‌లకే దక్కుతుందని అన్నారు. బీఆర్ఎస్ అధికారం లోకి వచ్చి ఉంటే మానేరు రివర్‌ఫ్రంట్ తుది దశకు చేరుకొని మానేరు నదిలో బోటింగ్ ప్రారంభమయ్యేదని అన్నారు. కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా ఓడిపోయి నామినేటెడ్ పదవి దక్కించుకున్న కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డికి అభివృద్ధి అంటే ఏమిటో కూడా తెలియదని వారు ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు చేస్తున్న విమర్శలను వారు తీవ్రంగా ఖండించారు. మీకు నగర అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే గంగుల కమలాకర్ కంటే ప్రభుత్వం నుంచి ఎక్కువ నిదులు తీసుకువచ్చి మాట్లాడాలని హితవు చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కరీంనగర్‌కు ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదని ఆరోపించారు. మీ పార్టీలో నాయకుల మధ్య విబేదాలు లేవా.. మా మేయర్, డిప్యూటీ మేయర్‌పై మాట్లాడుతున్నారని అన్నారు. మమ్మల్ని విమర్శించే ముందు మీరు ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేపైగానీ, బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ నాయకులకు హెచ్చరించారు. నగరంలో సీఎం హామీ పనులు నిలిచిపోయాయని, పూర్తి చేసేందుకు నిధులు తీసుకురావాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ నేతల ఇళ్ల ముందు ఆందోళన చేస్తామన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు నాయకులు జంగిలి సాగర్, అయిలేందర్ యాదవ్, రాజశేఖర్, తోట రాములు, పుట్ట నరేందర్, నందెల్లి రమ, గందె మహేశ్, కోల సంపత్, తులా బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కేబుల్ తవ్వుతుండగా కరెంటు వైర్లు కట్

-నాలుగు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కరీంనగర్ రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో అధికారుల నిర్లక్ష్యంతో నాలుగు గ్రామాల ప్రజలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగి ఇబ్బందులకు గురవుతున్నారు. బొమ్మకల్ సబ్‌స్టేషన్ నుంచి దుర్శేడ్, నల్లగుంటపల్లి, గోపాల్‌పూర్, చేగుర్తి గ్రామాలకు అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. రైల్వే కేబుల్ మరమ్మతులో భాగంగా గుంతలు తీస్తుండగా విద్యుత్ సరఫరా అయ్యే కేబుల్ వైరు గురు వారం తెగిపోయింది. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు తాత్కాలికంగా మొగ్దుంపూర్ సబ్ స్టేషన్ నుంచి వ్యవసాయ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వ్యవసాయానికి సంబంధించిన కరెంటు కావడంతో ఓవర్‌లోడ్‌తో గ్రామాల్లోని ఇళ్లల్లో కరెంటు సరిగా రాక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్లలోని టీవీలు, వాషింగ్ మిషన్, విద్యుత్ పరికరాలతో పాటు, ఇళ్లలోని బోరు మోటార్లు కూడా నడవలేని పరిస్థితి ఉందని, ఫీజులు పలు మార్లు కొట్టేస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ వైరును మరమ్మతులు చేయాలంటే మూడు రోజుల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. విద్యుత్ లైన్‌మన్ సంవత్సరం క్రితం సస్పెండ్ కాగా అప్పటి నుంచి ఎవరినీ నియమించలేదు. దుర్శేడ్ గ్రామానికి సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు

గణేశ్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఉమ్మడి జిల్లాలో మొట్టమొదటిసారిగా పైలెట్ ప్రాజెక్టుగా శనివారం చేపట్టిన సబ్‌స్టేషన్ మరమ్మతులు విజయవంతం అయినట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీజీ ఎన్పీడీసీఎల్ గతంలో సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేయాలంటే విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగేది. శనివారం విద్యుత్ సరఫరా నిలిపవేయకుండా సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహించామన్నారు. ఉదయం 9:30 నుంచి 12:30 వరకు టౌన్-8 సెక్షన్‌లోని వాటర్ వర్క్స్(హౌసింగ్ బోర్డు) ఉప కేంద్రం పరిధిలో విద్యుత్ సరఫరా అవుతుండగానే అధికారులు మరమ్మత్తులు చేపట్టారని ఎస్ఈ తెలిపారు.

ఉపాధిహామీ పనులపై గ్రామ సభలు

కరీంనగర్ రూరల్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలో ఉపాధిహామీ పనులు, కూలీలకు వంద రోజుల పనులు కల్పించడం, పనులను గుర్తించి బడ్జెట్ ఎస్టిమేషన్ కోసం బహదూర్‌ఖాన్‌పేట, ఫకీర్‌పేట, ఇరుకుల్ల, మందులపల్లి గ్రామాల్లో శనివారం గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పనులను గుర్తించి గ్రామ సభలో తీర్మానం చేశారు. ఈకార్యక్రమాల్లో ఎపీఓ శోభరాణి, స్పెషల్ ఆఫీసర్లు వైశాలి, నలినికాంత్, ఆయా గ్రామాల కార్యదర్శులు, టీఎలు ,పిఎస్‌లు, ఎఫ్ఎలు, ఉపాధి కూలీలు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఆర్చరీలో పారమిత విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ ఫర్ ఆల్(ఎస్ఎఫ్ఏ) హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ నెల 16న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో నగరంలోని పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు టి హరిణి, టి హర్షితలు ప్రతిభ కనబరిచి రజత, కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హన్మంతరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ ప్రసాదరావు, డైరెక్టర్స్ ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, వియుఎం ప్రసాద్, వినోద్‌రావు, రమణ, హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపికృష్ణ, సమన్వయకర్తలు రబీంద్ర పాత్రో, భవాని, సరిత, వ్యాయామ ఉపాధ్యాయులు గోలి సుధాకర్, ఎస్ రాజులు అభినందించారు.

నియామకం

సుభాష్‌నగర్,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రెడ్డి సంఘాల ఐక్యవేదిక యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కంది శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు ఎలిమినేటి సుమాన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికి శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే వెలిచాల జగపతిరావుకు నివాళి


జగపతిరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో శనివారం వెలిచాల జగపతిరావు రెండో వర్ధంతిని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు యువసేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, యువసేన ప్రతినిధులు ఎలిచాల జగపతిరావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగపతిరావు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా అత్యుత్తమ సేవలు అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కోడూరి సత్యనారాయణగౌడ్, ఆరెపల్లి మోహన్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఆకారపు భాస్కర్‌రెడ్డి, వహజుద్దీన్, తిరుపతిగౌడ్, వైద్యుల అంజన్‌కుమార్, కార్పొరేటర్లు సరిళ్ళ ప్రసాద్, కాశెట్టి లావణ్య శ్రీనివాస్, గంట కళ్యాణి శ్రీనివాస్, ఆకుల పద్మప్రకాష్, ఆకుల నర్మదా నర్సయ్య, బుచ్చిరెడ్డి, వినోద శ్రీనివాస్, నేతికుంట యాదయ్య, మెండి శ్రీలత చంద్రశేఖర్, కోటగిరి భూమాగౌడ్, ర్ష కిరణ్మయి మల్లేశం పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తా: నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వినరేందర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లి మండలం చింతకుంటలోని సాంఘిక సంక్షేమ, ప్రభుత్వ పాఠశాలలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మద్దతు పలకాలని కోరారు.

రవీందర్‌సింగ్‌కు మద్దతుగా పాదయాత్ర

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 19: పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్‌కు మద్దతుగా విద్యార్థులు పాదయాత్ర నిర్వహించారు. శనివారం నగరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు హరిప్రసాద్, కెమసారం తిరుపతి, సోహెన్‌సింగ్ శాతవాహన స్టూడెంట్ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చైతన్య ఆధ్వర్యంలో కొండగట్టు వరకు చేపట్టిన పాదయాత్రను ప్రారంభించారు.

నేటి నుంచి యజ్ఞవరాహ క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు


ముస్తాబైన యజ్ఞవరాహస్వామి దేవాలయం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 19: జిల్లా కేంద్రంలోని యజ్ఞవరాహ స్వామిక్షేత్రం 38వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఆదివారం నుంచి 25వ తేదీ వరకు తిరుమలలో మాదిరిగా సర్వవైదికసంస్థానంట్రస్టు ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవోపేతంగా కొనసాగనున్నాయి. ఆదివారం ఉదయం పుణ్యాహవాచనంతో మొదలై 25న ఉదయం రథ, చూర్ణోత్సవ, వసంతోత్సవాలు, చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణ, పూర్ణాహుతి, శ్రీపుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయి. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని సర్వవైదికసంస్థానంట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ కోరారు.

● నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో శనివారం శ్రీవత్సమ్ పేరుతో కల్యాణ ప్రసాద కౌంటర్‌ను వరప్రసాద్ పూజలు చేసి ప్రారంభించారు.

కరాటేలో విద్యార్థిని ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల నగరంలోని జ్యోతినగర్‌లోగల ఇంగ్లీష్ యూనియన్‌లో నిర్వహించిన కరాటే పోటీల్లో చిల్ల శ్రేష్ట బ్లాక్ బెల్ట్-1 డిగ్రీ సాధించింది.

ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ తన కార్యాలయంలో శ్రేష్టను అభినం దించారు. కార్యక్రమంలో ఒకినావా సంస్థల చీఫ్ ఎగ్జామినర్ కె వసంత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'బిర్లా ఓపెన్ మైండ్స్' వార్షికోత్సవం

కరీంనగర్ రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలోని బిర్లా ఓపెన్‌మైండ్స్ స్కూల్‌లో మెరిట్‌మెంట్ షో కార్యక్రమంలో విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. శనివారం స్కూల్ మైదానంలో చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి జ్యోతి ప్రజ్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడతాయని తెలిపారు. విద్యార్థులకు ఉపన్యాస పోటీలను నిర్వహించారు.విద్యార్థులనే కాకుండా వారి తల్లిదండ్రులను కూడా పాఠశాలలో బాగం చేసి రకరకాల సరదా ఆటలను నిర్వహించారు.

పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్య, నాట్య ప్రదర్శనలు పలువురిని అలరించాయి. పలు నృత్య ప్రదర్శనలు, సినిమా డ్యాన్సులతో హోరెత్తించారు. సాయంత్రం వేల స్కూల్ మైదానంలో ఆట పాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, పలువురు విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ట్రినిటి చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి, నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

'దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం'

సుభాష్‌నగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హిందువుల ఆత్మగౌరవం దెబ్బతీసే విదంగా కొందరు మతోన్మాదులు గుళ్ళు, గోపురాలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విశ్వహిందు పరిషత్ నగర అధ్యక్షుడు ఇనుగుర్తి రమేశ్, భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ కన్నం శంకర్ ఆరోపించారు. శనివారం హిందు విగ్రహాలపై దాడుల పట్ల విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మతోన్మాదులు రాష్ట్ర వ్యాప్తంగా హిందు దేవుళ్ళ విగ్రహాలపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్ బాధ్యులు స్వరూప రాణి, కోమల రాజేందర్‌రెడ్డి, తోట ప్రదీప్, గుజ్జెటి రాజేందర్, శ్రీనివాస్, సుదర్శన్, తోట రాజేందర్, బత్తుల జగదీష్, విఠలాచారి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి

చిగురుమామిడి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అర్హులందరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దుబ్బాక బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొమ్మనపల్లి తదితర గ్రామాల్లో పీఆర్టీయూటీఎస్ మద్దతు ఇస్తున్న వంగ మహేందర్‌రెడ్డికి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్, నాయ కులు మల్లన్న శాస్త్రి, రాజేశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫైయర్ బహూకరణ

హుజూరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బోర్నపల్లి ప్రభుత్వ పాఠశాలలో 1990-91లో ఏడో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆర్ వేణు, ఎస్ రాజేందర్, ఎం కోటిలింగం, ఎం నర్సింగం తదితర మిత్రులు కలిసి రూ. 10వేల విలువ చేసే వాటర్ ప్యూరిఫైయర్ ఇన్‌చార్జీ హెచ్ఎం బండ రాజిరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో మాక్ పోలింగ్


పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

జమ్మికుంట రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రజాస్వామ్యం - ఎన్నికలపై అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆకుల సదానందం, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, వెంకటిరెడ్డి, సదానందం, సంతోష్, రవీందర్‌రెడ్డి, స్రవంతి, యేసుమని, శ్రీనివాస్, స్వామి, లక్ష్మి, వనజ, సమ్మయ్య, సంపత్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల పంపిణీ

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుకులగిద్దె గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామానికి చెందిన దివ్యాంగులకు డిపో మేనేజర్ రవీంద్రనాథ్ బస్‌పాస్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కారోబార్ ఎం. సురేందర్, ఆర్టీసీ సిబ్బంది జీఎస్‌రెడ్డి, ఐలయ్య, సాయిచరణ్, గ్రామ సభ్యులు ఉన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం గ్రామ కార్యవర్గం

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రావ్‌పల్లి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం కార్యవర్గాని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చొప్పరి కిషన్, ఉపాధ్యక్షులు కన్నెబోయిన రాజయ్య, ఇల్లందుల లక్ష్మణ్, కార్యదర్శిగా బోయిని కిషన్‌ను ఎన్నుకున్నారు. సంయుక్త కార్యదర్శిగా సమ్మయ్య, కోశాదికారిగా రామగిరి శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా ముద్దమల్ల రవి, చొప్పదండి వసంత్ ఎన్నికయ్యారు.

నలుగురిపై కేసు నమోదు

జమ్మికుంట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలో కన్నూరి వెంకటయ్యపై దాడి చేసిన నలుగురిపై శనివారం కేసు నమోదు చేశామని పట్టణ సీఐ వరగంటి రవికుమార్ తెలిపారు. రోడ్డు పక్కన పంక్చర్ దుకాణం పెట్టుకున్న తనపై నలుగురు వ్యక్తులు దాడి చేసి టేలా ధ్వంసం చేశారని వెంకటయ్య శనివారం చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకటమల్లు, రాజేందర్, రవి, గోపిలపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల జాడేది..?

- తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న దళారులు - పట్టించుకోని అధికారులు


హుజూరాబాద్ మండలం కనుకులగిద్దెలో ఆరబోసిన ధాన్యం

హుజూరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు అల్పపీడనం ఏర్పడడంతో వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలకు కల్లాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వరిధాన్యానికి క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ ప్రకటించింది. దీంతో రైతులు సన్న రకాన్ని ఎక్కువ మొత్తంలో సాగు చేశారు. పొట్ట దశలో దోమపోటు, పాము పోడ, మొగిపురుగు సోకింది. రైతులు కష్ట నష్టాలకు ఓర్చుకొని మందులను పిచికారి చేశారు. తీరా వరి కోతల సమయంలో కొనుగోలు కేంద్రాలు ప్రారం భించకపోవడంతో రైతులు దళారులకు తక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. దీనికి తోడు వర్షాలు పడుతుండడంతో రైతులు ట్రాక్ మిషన్లను తీసుకొచ్చి వరికోతలు కోయిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్ ఏ గ్రేడ్ ధాన్యానికి 2,320, కామన్ రకానికి 2,300 రూపాయలు ప్రకటించింది. దళారులు క్వింటాల్ దొడ్డు రకం ధాన్యానికి 1,900 నుంచి రెండు వేల వరకు ధర చెల్లిస్తున్నారు. ఆరబెట్టని ధాన్యానికి క్వింటాల్‌కు 1,850 రూపాయల ధర మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో రైతు లు ఒక క్వింటాల్‌కు రూ. 300నుంచి రూ. 400 వరకు నష్టపోతున్నారు. డివిజన్‌లో జమ్మికుంట, హుజూ రా బాద్, ఇల్లందకుంట, వీణవంక, సైదాపూర్, శంకరపట్నం మండ లా లు ఉన్నాయి. ఆరు మండలాల్లో యేటా సుమారు 80వేల ఎకరాల్లో వరిసాగు చేస్తారు. లక్షలాది క్విం టాళ్ల వరిధాన్యాన్ని ఈ ప్రాంత రైతులు పండిస్తారు. ఇప్పటికైనా జిల్లా మంత్రులు, కలెక్టర్ కలుగజేసుకొని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

నిత్యావసరాల పంపిణీ

రామడుగు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో గామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా 40 మందికి నిత్యావసర వస్తువులు, పదిమందికి వెయ్యి రూపాయల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో గామా ఫౌండేషన్ చొప్పదండి నియోజకవర్గ ప్రాజెక్ట్ డైరెక్టర్ జోగుపాలు, మండల కో ఆర్డినేటర్లు శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్, సురేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి జేఏసీ పాదయాత్ర

గంగాధర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యునివర్సిటీ విద్యార్థి జేఏసీ చేపట్టిన పాదయాత్ర గంగాధర నుంచి కొనసాగింది. గంగాధర ప్రధాన రహదారిపై అంబేద్కర్ విగ్రహనికి విద్యార్థి జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల్ల చైతన్య పూల మాలవేసి యాత్రను కొనసాగించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ



మాట్లాడుతున్న మిషన్ భగీరథ ఎస్ఈ రాములు

శంకరపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ఎంపీడీవో సమావేశ మందిరంలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్ర మంలో భాగంగా నాలుగో రోజు పైపులైన్, ఇంటికి నల్ల కలెక్షన్లపై మంచినీటి సహాయకులకు మాస్టర్ ట్రైనర్ శ్రీరాములు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమంలో మిషన్ భగీరథ ఎస్ఈ రాములు మాట్లాడారు. నాలుగు రోజుల పాటు జరిగిన శిక్షణలో నేర్చుకున్న అంశాలపై వారి వద్ద నుంచి సమాధానాలు రాబట్టారు. ప్రతి ఒక్కరూ బాధ్యతయుతంగా పనిచేయాలని సహాయకులను ఆదేశించారు. ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు రాకుండా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ అంజన్‌రావు, ఈఈ ఎండీ ఖాజా వశీయుద్దీన్, ఏఈ మొగిలి, ల్యాబ్ సిబ్బంది సురేష్, కోటిలింగం, హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని కొండన్నపల్లి, హిమ్మత్‌నగర్, గట్టుబూత్కూర్, చిన్నాచంపల్లి, ఆచంపల్లి, తాడిజెర్రి, కురిక్యాల, మల్లాపూర్, గోపాల్‌రావుపల్లి, వెంకంపల్లి, కాసారం, గంగాధర, లక్ష్మీదేవిపల్లి, బూరుగుపల్లి, నర్సింహుల పల్లి, లింగంపల్లి, ర్యాలపల్లి, చర్లపల్లి(ఆర్) కొండయ్యపల్లి, చర్లపల్లి(ఎన్), వెంకటయ్యపల్లి, ఇస్లాంపూర్ గ్రామాల్లో ఐకేపీ, వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. ఏదైనా సమస్య వస్తే తన దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు వెలిచాల తిరుమల్‌రావు, బాలగౌడ్, తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి, ఏపీఎం పవన్ కుమార్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు కరుణాకర్, నాయకులు తదితరులు ఉన్నారు.

బాలికల జట్టుకు అభినందన

రామడుగు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రామడుగు జడ్పీ పాఠశాల అండర్-14 బాలికల జట్టు వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటడంతో శనివారం పలువురు అభినందించారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన అండర్-14 బాలికల విభాగం వాలీబాల్ పోటీల్లో రామడుగు జడ్పీ ఉన్నత పాఠశాల జట్టు జిల్లాలో ద్వితీయ స్థానం కైవసం చేసుకుందని హెచ్ఎం పద్మజ తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

చొప్పదండి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ సైనిక స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఎస్జీఎఫ్ఐ పోటీలకు ఎంపిక అయ్యారు. 11వ తరగతికి చెందిన దినేష్, రోషన్ ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన అండర్-19 జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో పతకాలు సాధించి హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్, ప్రధానోపాధ్యాయుడితో పాటు పలువురు శనివారం అభినందించారు.

క్యాటరింగ్, హెల్పర్స్ అసోసియోషన్ రాష్ట్ర కార్యవర్గం

వీణవంక అక్టోబర్ 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం తెలంగాణ ఆల్ క్యాటరింగ్ అండ్ హెల్పర్స్ అసోసియోషన్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడుగా మహమ్మద్ నాసిరోద్దీన్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఎండీపాషా, సెక్రటరీగా ఎండి షాహేదా, జాయింట్ సెక్రటరీగా రాజ్ మహమ్మద్, ట్రెజరరీగా కొలిపాక సదయ్యను ఎన్నుకున్నారు. త్వరలో జిల్లా, మండల కమిటీలను ఎన్నుకుంటామని తెలిపారు.